# న్యాయో రక్షతి

ధర్మారావుకి నిద్ర పట్ట లేదు. నిండా దుప్పటి కప్పుకొని గట్టిగా కళ్ళు మూసుకొని పడుకున్నాడు.

గత రెండు రోజులుగా అతనికి బొత్తిగా నిద్రపట్టటం లేదు. అంతు చిక్కని ఆలోచనలు అతని మదిలో మెదలుతున్నాయి.

పరుగెత్తుకొని వచ్చేస్తోంది పదోతారీకు!

పదోతారీఖు అతనికి చాలా ముఖ్యమైన రోజు.

ఆ రోజు అతని ఒక్కగానొక్క కూతురికి పెళ్ళి సంబంధం ఖాయం చెయ్యాలి. అమ్మాయికి తాంబూలాలు పుచ్చుకోవాలి.

ఆ రోజే పెళ్ళి కొడుక్కాయనివ్వాల్సిన కట్నం అప్పజెప్పాలి!

డబ్బుల సంగతి గుర్తుకొచ్చే సరికి ధర్మారావు గుండెల్లో రాయి-పడినట్లయింది.

ఇంకా మిగిలింది నాలుగు రోజులే. ఆ నాల్గు రోజులలో అంత డబ్బు ఎలా తేగలడు? ఎక్కడనుంచి తేగలడు?

గట్టిగా నిట్టూర్చాడు ధర్మారావు.

ఎక్కడో గడియారం మూడుసార్లు మ్రోగినట్లనిపించింది. డిశం-బరు నెలలో చలికి వణికి పోతున్న ప్రపంచం ప్రశాంతంగా నిద్రపోతోంది.

ఓ అతి సాధారణమైన కుటుంబంలో పుట్టాడు ధర్మారావ్. అతి-సాధారణంగా పెరిగాడు. కొద్దిగా చదువుకున్నాడు కనుక 'సమితి' స్కూల్లో మాష్టారుగా చేరాడు. దాదాపు ముప్పది సంవత్సరాలు పని చేసి ఆరునెలల క్రితమే రిటైర్ అయ్యాడు. మంచి వాడని, మాట-మీద నిలబడే వాడని మంచి పేరు తప్ప మరేమీ సంపాదించ లేక పోయాడు ధర్మారావు. ఏమీ సంపాదించ లేక పోయాడని ఎప్పుడు బాధపడలేదు కూడా.

"ఏమండీ శాస్త్రి మేష్టారు ఇల్లు కొన్నారటండి." ఓసారి అతని

భార్య కామేశ్వరమ్మ అంది భర్తతో. "అతను మొన్న మొన్ననే కదండీ సర్వీసులో చేరాడు."

"అయితే ఏం టంట?" చాలా ప్రశాంతంగా అడిగాడు ధర్మారావు.

"మన కంటే చిన్న వాళ్ళు కూడా ఎలా జాగ్రత్త పడుతున్నారో చూడండి." కామేశ్వరమ్మ మెల్లగా అంది. "మనమూ వున్నాము. పాతికేళ్ళు దాటిపోయాయి సర్వీసులో చేరి. ఉండటానికి ఇంకా కొంప కూడా లేదు." ఆవిడ అసంతృప్తివ్యక్తం చేసింది.

"చూడు కాముడు, అందరిలా నానా గడ్డితిని నేను డబ్బు సంపాదించలేను. పాతికేళ్ళుగా నాతో కాపురం చేస్తున్నావు నువ్వు ఈ మాత్రం తెలుసుకోలేక పోయావా?" ఓ నిముషం ఆగాడు ధర్మారావ్. "ఆమాట కొస్తే డబ్బే బ్రతుకని అనుకోటం లేదు కాముడూ. అది నీకు తెలుసు."

కామేశ్వరమ్మకి ఏమి మాట్లాడాలో తోచలేదు.

"అయినా కాముడూ మనకి ఇప్పుడు ఏంటి తక్కువ?" ధర్మారావు మళ్ళీ అన్నాడు. "హాయిగా వున్నాం. రిటైర్ అయిన తర్వాత వచ్చే డబ్బుతో పాపపెళ్ళి కూడా చేసేస్తే కాళ్ళు చాపుకొని కూర్చోవచ్చు."

రిటైర్ అయిపోయాడు ధర్మారావు. కానీ పాప పెళ్ళి మాత్రం యింకా చెయ్యలేక పోయాడు.

పదో తారీఖుకు యింకా మిగిలినవి నాలుగు రోజులే.

ఈ నాలుగు రోజుల్లో కట్నం డబ్బులు సర్దుకోవటం ఎలాగ?

లేచి కూర్చున్నాడు ధర్మారావ్. కొద్ది దూరంలో అతని భార్య, పాప ప్రశాంతంగా నిద్రపోతున్నారు. ఆ గదిలో వెలిగే గుడ్డిదీపం వెలుతురులో వాళ్ళ మొహాలు సమంగా కనబడటంలేదు. ఎంత ప్రయత్నించినా ఆ గదిలో పూర్తిగా వెలుగునింపటానికో కరంటు బల్బు లేనందు వల్ల నిలచిన ఆ గుడ్డి దీపం అతని బ్రతుకుకి ప్రతిబింబంలా తోచింది ధర్మారావుకి.

లేచివెళ్ళి ఓగ్లాసు మంచినీళ్ళు త్రాగాడు. ముందు వసారాలోకెళ్ళి పడక కుర్చీలోవాలాడు.

అతని మనస్సులో ప్రపంచమంతా చీకటి కమ్మేసివుంది. వెలుగు చుక్కలు రాల్చే మిణుగురు పురుగులు కూడా కనబడటం లేదు.

ఇప్పుడేమిటి చెయ్యటం?

పాపకి కుదిరిన సంబంధం తన తాహతుకు మించినదేనని ధర్మా-రావుకు తెలుసు.

డబ్బు సర్దుబాటు చేసి పెళ్ళి చేసిపంపటం కష్టమవుతుందని కూడా తెలుసు.

కానీ పాప సుఖపడుతుందనే నమ్మకం, సుఖపడాలనే తండ్రికి సహజమైన ఆశ, ఆరాటం అతన్ని పరిగెత్తించింది.

సాంప్రదాయ సిద్ధమైన కుటుంబంలోని కుర్రవాడు, మంచివాడు, ఇంజనీరింగు చదివేడు, మంచి ఉద్యోగంలోవున్నాడు.

వాళ్ళ తాహతుకి పాతికవేల కట్నం ఎక్కువేంకాదు. రూపాయి బిళ్ళ నెత్తిన అంటించి రోడ్డు మీదకు పంపిస్తే అర్థరూపాయన్నా ఖరీదు చేయనటు వంటి పెళ్ళికొడుకులే, గోచీగుడ్డతో సహామామగారి దగ్గరే వసూలు చేయాలని అనుకునే ఈ రోజుల్లో వాళ్ళడిగింది ఎక్కువ అనిగాని, అన్యాయమనిగాని అనిపించలేదు ధర్మారావుకి.

"చూడండి ధర్మారావుగారు నేను గొప్పచెప్పటంలేదు గానీ మావా-డికి లక్షదాకాయిస్తామని వస్తున్నారు. వాడికి మీ అమ్మాయి నచ్చింది."

ధర్మారావుగారి కాబోవు వియ్యంకుడు దయానిధి అన్నాడు. "ఎంత మొగపెళ్ళి వారమైనా మాకూ ఏవోఉంటాయి కదండీ ఖర్చులు. మరీ చేతి డబ్బులు పెట్టుకోలేంగదా?" దయానిధి ఓ నిముషం ఆగి అన్నాడు. "ఓ పాతిక వేలు మొత్తంమ్మీద యిచ్చేస్తే సర్దుకుంటాను. ముహూర్తాలు పెట్టుకుందాం."

ధర్మారావు గుండె ఆగిపోయి నట్లయింది. పాతిక వేలే! పాతిక-వేలు కట్నమే అయితే మరి పెళ్ళి ఖర్చులో!

"తొందర లేదు, మీరు ఆలోచించి చెప్పండి. మావాడు మీ అమ్మాయి మీద ఆశపడుతున్నాడు కనుక కట్నమడగటం లేదు-పెళ్ళి ఖర్చులడిగాం అంతే" దయానిధి బయలు దేరుతు అన్నాడు.

"ఏ సంగతీ రెండు రోజుల్లో చెప్తారుగా."

ధర్మారావుకి ఏంచెయ్యాలో తోచలేదు. రిటైర్‌మెంటు డబ్బు-లింకా అందలేదు. ఎంత అందుతుందో తెలీదు.

అంతమంచి సంబంధాన్ని వదలు కోటానికి మనసొప్పలేదు. ఒక్క-గానొక్క కూతురు. ఎలాగో అలాగ ఈ సంబంధం చేయగలిగితే అది సుఖపడుతుంది.

మరి డబ్బులో?

పదిమందిని అడిగయినా సరే ఆ సంబంధమే చేయాలను కున్నాడు. అప్పటివరకు ఎవ్వరిని ఏమీ అడగలేదు. ఎవరయినా సహాయం చెయ్యక పోతారా అని అనుకున్నాడు ధర్మారావు.

పదో తారీకు తాంబూలాలు పుచ్చుకోటానికి వైశాఖంలో పెళ్ళి చెయ్యటానికి ఒప్పుకున్నాడు.

వైశాఖంలోగా రిటైర్‌మెంట్ డబ్బురాకపోదు. తాంబూలాలు పుచ్చుకొనేటప్పుడే కట్నం ఇచ్చేయాలన్నారు.

ధర్మారావు ఊరిమీద పడ్డాడు. అతని శిష్యుల్ని తెలిసిన వారిని, చేయిచాచి అడిగాడు. పనిచేసిన ప్రతీ ఊరు వెళ్ళి సహాయం చేయమని కోరాడు. సహాయం చేయదలచుకున్న వారు కొద్దిగా చేశారు. మరి కొందరు పెళ్ళి టైముకు ఏదో సర్దుతామన్నారు.

"అప్పుడే లేచారేమిటండి!" కామేశ్వరమ్మ మాటలువిని ఉలిక్కి-పడ్డాడు ధర్మారావు.

ఇంకా తెల్లవారే సూచనలు లేవు. చీకటిగానే ఉంది.

"ఏమండీ. నిద్రపట్టలేదా?" కామేశ్వరమ్మ మెల్లగా వచ్చి భర్త పడక కుర్చీకి దగ్గరగా కూర్చుని అడిగింది.

ధర్మారావు ఏమీ అనలేదు.

"నేను గమనిస్తూనే ఉన్నానండీ. మీరు నిన్నామొన్నా కూడా సమంగా నిద్రపోవడంలేదండి. ఇలా అయితే ఒంటికి వచ్చేస్తుంది." భర్త ఆరోగ్యం గురించి ఆందోళన వ్యక్తం చేస్తూ అంది ఆవిడ.

"మంచి నీళ్ళు తెమ్మన్నారాండీ"

"ఒద్దు కాముడూ."

ధర్మారావు కాసేపు ఆగి అన్నాడు. "ఇంకో నాలుగు రోజుల్లోకి వచ్చేసింది పదో తారీఖు."

"నాకూ గుర్తుందండి అటూ ఇటూ తిరిగి పడుకుంటున్నానే తప్పా నాకూ నిద్ర పడుతోందా?" ఆవిడ గొంతు జీరబొయింది.

"ఆ భగవంతుడు ఏం చెయ్యదలచు కున్నాడో? ఏమో?" చీర కొంగుతో కళ్ళొత్తుకుంటూ అంది ఆవిడ.

"నా కేమీ మార్గం కనిపించడంలేదు కాముడు. ఇప్పటి వరకు జీవితంలో మాటపడలేదు, మాట తప్పలేదు. మరి ఈ సారి ..."

ధర్మారావు కంట్లో నుంచి రాలిన కన్నీటి చుక్కలు ఆ చీకట్లో కూడా కనిపించాయి కామేశ్వరమ్మకి.

"బాధ పడకండి" ఆవిడ మెల్లగా అంది. "అయినా యింకా ఇప్పుడు బాధపడి ప్రయోజనం ఏమిటి?"

"ఏమిటి నువ్వు అనేది?" ధర్మారావు కొద్దిగా కర్కశంగా అడిగాడు.

"అదికాదండీ" ధర్మారావు గొంతుకి కొద్దిగా అదిరిపోయిన కామేశ్వ-రమ్మ సంబాళించు కొని అంది. "ఇప్పటి వరకూ వచ్చిన అవకాశాలన్నీ విడిచి పెట్టారు. ఏవీ సంపాదించలేక పోయారు. ఇప్పుడు మనకు అత్యవసరం వచ్చినా మీ పద్ధతులు మార్చుకోలేక పోతున్నారంటే..."

"ఏమిటి కాముడూ నీ ఉద్దేశం?"

"అదేనండీ మొన్నమొన్న వచ్చిన అవకాశం కూడా విడిచి పెట్టారు కదండి. చేతికి అందిన నిధి అదే ఆపెట్టె వాళ్ళకి అప్పచెప్పేసారు కదండీ. అంత కంటే మంచి అవకాశం మనకేంవస్తుందండీ." ఓ నిముషం ఆగి భర్త మొహంమీద భావభేధాలు గమనిస్తూ అంది ఆవిడ. "దేవుడేమన చేతికి అందించేదనుకొని ఆ పెట్లో డబ్బు తీసుకొని

ఉండవచ్చు కదండి. పాప పెళ్లి జరిగిపోయేది."

"కాముడూ" గట్టిగా అరిచాడు ధర్మారావు. "పాతికేళ్ళుగా నాతో కాపురం చేశాక నువ్వు నాగురించి తెలుసు కున్నదిదేనా? నేనెప్పుడైనా అన్యాయంగా ఎవరి డబ్బులైనా ముట్టు కున్నానా?"

"మీకూ, మాకూ మిగిలింది ఆగొప్పేనండి. న్యాయంగా బ్రత-కటం గొప్పే కానీ యిప్పుడు న్యాయం. ధర్మం అని కూర్చుంటే పాప బ్రతుకు చీకటై పోతుందేమోనని . . ." దుఃఖంతో ఆవిడ గొంతు మూగబోయింది.

ధర్మారావుకి ఏం మాట్లాడాలో తోచలేదు. కొద్ది నిముషాల పాటు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం ఆవరించింది.

"ఏమిటో కాముడూ నాకు పిచ్చెక్కి పోతుంది." పడక కుర్చీ-లోంచి లేస్తూ అన్నాడు ధర్మారావు "కొద్దిగా కాఫీ కలిపి పట్రాగలవా?"

"పాలులేవండీ. డికాషను కలిపి తెమ్మంటారా?"

"అలాగే కానీ. మన బ్రతుకే పాలులేని కాఫీ కదా!" నిట్టూ-ర్చాడు ధర్మారావు.

కామేశ్వరమ్మ లోపలికెళ్ళింది.

అశాంతిగా అటూ ఇటూ నడిచాడు ధర్మారావు. ఆ పెట్టెలో నగలుండేవి. అతని అవసరమూ తీరిపోయేది ఆ పెట్టె స్వంతం చేసుకొని ఉంటే . . .

పాప పెళ్ళికి తాంబూలాలు పుచ్చుకోటానికి ముహూర్తం పెట్టు-కొని వస్తున్నాడు ధర్మారావు. కొంత మంది స్నేహితుల్ని కలిసి పెళ్ళికి సహాయం చెయ్యమని అడిగి ట్రైన్ ఎక్కే సరకి రాత్రి పదిదాటి పోయింది.

కంపార్టుమెంటులో కాలుపెట్టటానికి కూడ చోటు లేనంత జనం-ఉన్నారు.

పగలంతా స్నేహితులని కలవటం కోసం తిరిగి తిరిగి అలసి పోయిన ధర్మారావు నించోలేక పోయాడు. మెల్లగా చోటు చేసుకొని లోపలకె-ళ్ళాడు. ఓ క్రింద బెర్తుమీద ఒకావిడ పసి పిల్లని దగ్గర పెట్టుకొని

పడుకొని వుంది. ఆవిడ కాళ్ళ దగ్గర ఉండే కొద్దిపాటి చోటులో సర్దుకొని కూర్చున్నాడు.

ఆలోచనలతో సతమత మవుతున్న అతనికి ఎన్ని స్టేషన్లు దాటాడో తెలీలేదు. ట్రైనులో రద్దీ పెరిగింది గాని తరగలేదు.

అనకాపల్లి కాబోలు వచ్చింది. భర్త పిలుపుకు ఆవిడ ఉలిక్కిపడి లేచింది. నిద్రపోతున్న పాపని బుజంమీద వేసుకొని, రెండు చేతు-ల్లోనూ సామాన్లతో దిగుతున్న భర్త వెనుక దిగిపోయింది.

చోటుదొరికింది కదా ఓగంట పడుకోవచ్చని నడుమువాల్చాడు ధర్మారావు. అతని తలకి తగిలిందొక చిన్న బ్రీఫ్ కేస్!

ఆ అమ్మాయి బ్రీఫ్ కేస్ మర్చిపోయిందా! బెర్తులన్నీ ఖాళీఅయిపో-యాయి. కొత్తగా జనాలెక్కారు.

పెట్టెదిగి పోయిన వాళ్ళెవరిదై అయి ఉండాలి.

చుట్టూ పరీక్షగా చూశాడు. ఎవరూ బ్రీఫ్ కేస్ గురించి పట్టించు కోవటం లేదు.

విశాఖపట్టణం దగ్గర పడుతున్న కొద్దీ ధర్మారావు గుండెలు గట్టిగా కొట్టుకున్నాయి. ఇప్పుడు ఆ పెట్టె ఏం చెయ్యాలి?

ఆ పెట్టెతీసికెళ్ళితే దొంగ తనం అవదా? ట్రైన్ లో వదిలి వెళితే యింకెవరైనా తీసికెళ్ళ వచ్చు కదా?

ధర్మారావు దీర్ఘంగా ఆలోచించాడు.

విశాఖపట్నం రానే వచ్చింది. కంపార్టుమెంటు పూర్తిగా ఖాళీ అయిపోయింది.

ఎవరూ బ్రీఫ్ కేస్ అడగలేదు.

ధర్మారావు ఓ నిర్ణయానికి వచ్చాడు. ట్రైన్ బయలు దేరేవరకూ ఆగాడు. ఎవరూ పట్టించు కోని ఆపెట్టెని చివర నిముషంలో తీసి-కొని యింటికి వెళ్ళాడు. అడ్రసు తెలుసు కొని అప్పచెప్పాలకున్నాడు.

ఇంటికి వెళ్ళి పెట్టెని పరీక్షించాడు పైనెక్కడా అడ్రసు లేదు.

పెట్టె తాళం వేసి ఉంది. సందిగ్ధంలో పడ్డాడు ధర్మారావు.

తాళం తీసి చూస్తే అడ్రస్సేమైనా దొరుకుతుందేమో! గానీ ఇతరుల పెట్టె తాళం తీయటం సభ్యత కాదుకదా!

ఓ రెండు గంటల పాటు తనమనస్సులోనే తర్జన భర్జన పడి పెట్టె తాళం తీసాడు. అతని కళ్ళు బైర్లు కమ్మాయి.

పెట్టెనిండా నోట్లకట్టలు! ఓ పక్కన కొన్ని నగలు.

"ఏమండీ! దేవుడున్నాడండీ. దేవుడే దయతలచి మనకి పెట్టె నిచ్చాడండి." కామేశ్వరమ్మ సంబరంగా అంది. "మన పాప పెళ్ళి బ్రహ్మాండంగా చేసేయ్య వచ్చునండి."

ధర్మారావు కళ్ళు ఎర్రబడ్డయి. కోపంగా ఆమె వైపు చూశాడు.

"ఏం ఇదంతా మన డబ్బును కుంటున్నావా? సంబర పడటానికి. ఎవరిదో పాపం! డబ్బంతా పోయిందని ఎంత బాధపడుతుంటారో?"

నోట్ల కట్టలు నగలు పక్కకు పెట్టి వెతికాడు. పెట్టె అట్టడుగున ఓ అడ్రసు కాగితం దొరికింది. అనకాపల్లి అడ్రసు.

గబగబా అన్నీ పెట్టెలో సర్దాడు. అడ్రసు కాగితం జాగ్రత్తగా జేబులో పెట్టుకున్నాడు.

పొద్దున్నే పెట్టెపుచ్చుకొని బయలు దేరిన భర్తని చూసి పట్టరాని కోపం కామేశ్వరమ్మకి.

"ఎలాగూ మీరు ఏమీ సంపాదించ లేక పోయారు. దేవుడిచ్చిన ఈ డబ్బుని కూడా పట్టుకెళతారేంటండీ? "

"చూడు కాముడు ఇది మన డబ్బుకాదు. న్యాయంగా బ్రతికే-వాడ్ని. పరాయి సొమ్ము ఉంచుకోలేను."

"మీ న్యాయం మండి పోనూ. అవతల పదోతారీకు పరుగెత్తు కొస్తోందని గుర్తుందా? తాంబూలాలెలా పుచ్చుకుందామను కుంటున్నారు? పాప సంగతి ఏం చేద్దామను కుంటున్నారు. ఏమిటండీ మీ ఉద్దేశం?" ఏ నాడు అడగనంత గట్టిగా నిలదీసింది భర్తని.

ఆమె మాట వినిపించుకోకుండా గుమ్మందాటుతున్న భర్త కాళ్ళు

పట్టుకుంది. "ఏమండీ ఈ పెట్టెలో డబ్బు తీసుకొని మన పాప పెళ్ళి ఖాయం చేసేద్దామండీ" ఆవిడ ప్రాధేయ పడింది.

"ఈ డబ్బు మనకే అందిందని ఎవరికీ తెలీదు కదండీ."

"నేను ఆపని చెయ్యలేను కాముడు."

ఆవిడ చేతులు వదిలించుకొని, పెట్టెపుచ్చుకొని గబగబా గేటు-దాటి వెళ్ళిపోయాడు ధర్మారావు, ఆరోజు.

ఓ గ్లాసులో డికాషన్ పోసుకొచ్చింది కామేశ్వరమ్మ

తెల్లవారుతున్నట్లుంది. చీకటి పొరలు మెలమెల్లగా తొలగిపోతు-న్నాయి.

గేటు చప్పడైనట్లు అని పించింది. ఎవరో తలుపు తట్టుతున్న-ట్లుంది.

దీపం వెలిగించి తలుపు తీసిన ధర్మారావ్ ఆశ్చర్యంతో చిత్తయి-పోయాడు. నోటమాట రాలేదు.

ఎదురుగా కనిపించారు దయానిధి అతని వెనుక ఇంకొకరు. "రండి. లోనికిరండి." ఓనిముషం సంబాళించు కొని అన్నాడు ధర్మారావ్.

"అదేంటడీ బావగారూ అలా కంగారు పడుతున్నారు. నేనేమిటీ ఇలా హటాత్తుగా ఊడి పడ్డానని ఆశ్చర్యపోతున్నారా?" కుర్చీలో కూర్చుని అన్నాడు దయానిధి. "మా కోడలు పిల్లని చూడాలని అనిపించింది వచ్చేసానంతే."

తీసిన తలుపునుంచి చల్లగా గాలివీచింది. ధర్మారావుకి కొద్దిగా మనస్సు కుదుటపడింది.

"అన్నట్టూ పరిచయం చెయ్యటం మర్చేపోయాను. వీడు నా ఆఖరి బావమరిది. అనకాపల్లిలో ఉంటున్నాడు."

అతన్ని ఎక్కడో చూసినట్టని పించింది ధర్మారావుకి.

"వీణ్ణి మీకు తెలుసు. మొన్న వాడో వెధవ పని చేసేడు. ఆనాడు మీరు ఆదుకోకపోతే......"

"అవునండీ ఆరోజు నేను ట్రైన్‌లో మర్చిపోయిన పెట్టె మీరు తెచ్చివ్వకపోతే......"

"ఇప్పుడు గుర్తొచ్చింది బాబు." ధర్మారావు అన్నాడు. "పోల్చుకో లేక పోయాను."

"వాడు నిన్న మాయింటికి వచ్చాడండీ బావగారు." దయానిధి అన్నాడు. "జరిగిందంతా చెప్పాడు. ఎవరా మహానుభావుడు అని అడిగితే మీ పేరు, అడ్రస్సు చెప్పాడు. వెంటనే మిమ్మల్ని కల్సుకొని నా ధన్యవాదాలు తెలపాలని వచ్చాను."

ధర్మారావు మౌనంగా వండిపోయాడు. ఆ పెట్టె ఇవ్వడం చాలా మంచి దయిందని అనుకున్నాడు.

"నేనో నిర్ణయానికి వచ్చేసాను బావగారు. ఇంకా ఆలస్యం చెయ్యటానికి వీలులేదు. పదో తారీఖు ముహూర్తం మంచిదట. ఆ రోజు తాంబూలాలు కాదు పెళ్ళే కానిచ్చేద్దాం."

పదో తారీఖు పెళ్ళా! బాబోయ్! ధర్మారావు మొహం మీద కంగారు వ్యక్తమైంది.

"మీరేం కంగారు పడకండి బావగారూ. పదో తారీఖు పెళ్ళి చేసేది మీరు కాదు మేం చేస్తాం."

"అంటే......"

"అదేనండీ అన్ని ఖర్చులూ మావే. చేతికందిన డబ్బు, నగలూ ప్రతి ఫలేచ్ఛ లేకుండా తిరిగి యిచ్చిన మహామనిషి మీరు. మీ చేతిలో పెరిగిన పిల్లని కట్నకానుకల పేరుతో వదిలేసుకునేంత మూర్ఖుణ్ని కాదునేను. గుణాని కంటే ఎక్కువ కాదండీ డబ్బు."

చీకటి పొరలని పూర్తిగా తొలగించు కొని వచ్చిన సూర్యుడు ఓ నూతన దినానికి నాంది పలికేడు.

* * *